క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

విజయపురం (నగరి): ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మాధవరం ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ గణేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో మిగిలిన సీట్ల కోసం 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 9వ తేదీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

విజయపురం ఎంపీడీఓగా చంద్రమౌళి



విజయపురం (నగరి): విజయపురం ఎంపీడీఓగా చంద్రమౌళి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నగరిలో ట్రైనింగ్ పూర్తి చేసుకోవడంతో విజయపురం ఎంపీడీఓగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టాక మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు.

వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబడుతున్న ఎంఈవో రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన పిల్లలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం నరసింహపురం, అయ్యావారికండ్రిగ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు రాస్తున్న ఎఫ్ఏ-2 పరీక్షలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని ముందుకు తేవాలని సూచించారు. అనంతరం కొన్ని పాఠశాలల్లో పిల్లలను ప్రశ్నలు అడిగారు. వారు సక్రమంగా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చేశారు.

దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: తిరుమల పాపవినాశంలో వ్యాపారస్తులపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పాపవినాశం లైసెన్స్ వ్యాపారుల సంఘం నాయకులు సుబ్రమణ్యం, డబ్ల్యూస్.బాబు, ప్రకాష్, ప్రభ ఒక ప్రకటనలో కోరారు. తిరుమలలో పుట్టి పెరిగిన 37 మంది శ్రీవారిని నమ్ముకుని తిరుమల అటవీ ప్రాంతమైన పాపవినాశనంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నట్టు తెలిపారు. అటవీశాఖ అధికారులు తమకు జీవనోపాధి కోసం గత ఆగస్టు 14న లైసెన్సులు మంజూరు చేశారని పేర్కొన్నారు. కొంత కాలం క్రితం డ్యామ్ పనుల కోసం వచ్చిన రాధాకృష్ణ అనే వ్యక్తి కొంతమంది బయటివారితో పరిచయాలు పెంచుకుని ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా తమిళనాడులోని బాణావరం, కంచి, చెన్నై నుంచి సుమారు 200 మంది షికారీలను తీసుకొచ్చి కొత్తగా వ్యాపారాలు చేయిస్తున్నాడని ఆరోపించారు. వారి నుంచి రోజుకు రూ.300లు చొప్పున వసూలు చేస్తూ దందాలు చేస్తున్నాడని వాపోయారు. తాము అడిగితే మిమ్మల్ని కొట్టి డ్యామ్‌లో తోసేస్తానని బెదిరిస్తున్నాడని తెలిపారు. ఈవిషయమై సంబంధిత అధికారులు స్పందించి దౌర్జన్యం చేసే వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏ1 సర్వీసెస్‌పై చర్యలు తీసుకోండి

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను నిలువునా మోసం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ ఏ1 సర్వీసెస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కార్మికులతో కలిసి రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం శానిటేషన్ సిబ్బందికి నెలకు రూ.16 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ సంస్థ రూ.11 వేల నుంచి రూ.12 వేలు ఇస్తూ కార్మికులను మోసం చేస్తోందన్నారు. 120 మంది కార్మికులతో నెట్టుకొస్తూ 200 మంది పనులు చేస్తున్నట్టు చూపుతూ ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారని, దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా మెరుగ్గా ఉందంటూ రోజువారి ధ్రువీకరిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల మేరకు 200 మందితో పనులు చేయించాలని, రూ.16 వేల వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఐదు రోజుల్లో వారికి నోటీసులు ఇచ్చి కార్మికులకు న్యాయం చేస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారన్నారు.

మనసున్న మారాజు | సీఎం జగనన్న

- ఓట్ల కోసం కాకుండా ప్రజల కోసం పరితపిస్తున్న గొప్ప వ్యక్తి
- గడిచిన నాలుగేళ్లలో 17 మెడికల్ కాలేజీలకు భూమిపూజ చేసి, 5 ప్రారంభించారు
- అందరికీ ఆరోగ్యం అందించడానికే జగనన్న ఆరోగ్య సురక్ష
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా



పుత్తూరు: తిరుమలకుప్పంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అందరికీ శ్రీరామరక్ష అని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం పుత్తూరు మండలం తిరుమలకుప్పం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మనసున్న మారాజు సీఎం జగనన్న అని, ఆయన ఎప్పుడూ ఓట్ల కోసం కాకుండా ప్రజల బాగు కోసం పరితపిస్తుంటారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న దృఢ సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. దేశ చరిత్రలో ఇప్పటివరకు ఎవరి ఊహకు అందని, అందినా ఎవరూ సాహసించలేని జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. గడిచిన నాలుగేళ్లలో రూ.8 వేల కోట్ల అంచనా వ్యయంతో 17 మెడికల్ కాలేజీలకు సీఎం జగన్ భూమిపూజ చేయగా ఇందులో ఐదింటిని ప్రారంభించారని తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గడచిన నాలుగేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత కంటి చికిత్సతో పాటు కంటి అద్దాల పంపిణీ కోసం రూ.13 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందన్నారు. చికిత్స తర్వాత విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1004 కోట్లతో 16.19 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. 108 సేవల కింద 768 అత్యవసర అంబులెన్స్‌లు, 910 మొబైల్ క్లినిక్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కోసం నాలుగేళ్లలో రూ.6,687 కోట్లతో 35 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. వైద్య శాఖలో డాక్టర్ల నుంచి నర్సుల వరకు 50 వేలకు పైగా నియామకాలు జరిగినట్లు వెల్లడించారు. అనంతరం హెల్త్ కార్డులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఆరోగ్య శిబిరంలో మంత్రి రోజా బీపీ చెక్ చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి, ఎంపీడీఓ పి.ప్రసాద్, డాక్టర్లు ఎస్.భువనేశ్వరి, సీ.సంగీత, ఇ.కళ్యాణి, ఎ.ఆర్.చైతన్య, గ్రామ సర్పంచ్ ఎం.సరస, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఎఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ పుత్తూరు రూరల్ మండల అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.



అరూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నింద్రలో..

నింద్ర: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు రక్ష అని మంత్రి రోజా అన్నారు. నింద్ర మండలం అరూరులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరూరు సచివాలయ పరిధిలో 626 కుటుంబాలకు సంబంధించి సర్వే చేయగా, 300 మందికి గుండె, బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. అందులో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా 77 మందికి కంటి అద్దాలను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్రబాబు, ఎంపీడీఓ అరుణ, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైద్యాధికారి కల్యాణి, పార్టీ జిల్లా కార్యదర్శి మేరి, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు, సర్పంచ్ కేశవులు, నాయకులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్ దేశ్‌ముఖ్‌ను అరెస్టు చేయాలి



సీఐ సురేష్‌కు ఫిర్యాదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నగరి: తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన యూట్యూబర్ అనిల్‌కుమార్ యాదవ్ దేశ్‌ముఖ్‌ను అరెస్టు చేయాలంటూ స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఐ సురేష్‌కు బుధవారం రాత్రి ఎంపీపీ భార్గవి ఫిర్యాదు చేశారు. అనిల్‌కుమార్ తన యూట్యూబ్ చానెల్ ద్వారా మంత్రి ఆర్‌కే రోజాను ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు ప్రచారం చేస్తున్నాడని అతని ప్రసారాలు దురుద్దేశపూర్వకంగా మంత్రిని అవమానపరిచేలా ఉన్నాయన్నారు. నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. రెండు పార్టీల మధ్య గొడవలకు ప్రేరేపించేలా అతని ప్రసారాలు ఉన్నాయన్నారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఎంపీటీసీ యేసు, సర్పంచ్‌లు రవి, చంద్రకళ, నాయకులు భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్, గుణ, శశికుమార్, హెన్రీ, సత్య, రాము తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు ఆస్పత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పౌష్టికాహారం పంపిణీ

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి బుధవారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. ఈ సందర్భంగా గర్భిణులు మాట్లాడుతూ ప్రతి బుధవారం కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ రోజు మేలు మరువలేమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రకాష్, శంకర్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్లు నారాయణస్వామి, పుష్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు మానసిక స్థైర్యంతో ఉండాలి



అన్నపూర్ణ శారదను సన్మానిస్తున్న అధ్యాపకులు

కార్వేటినగరం: సమాజంలో మహిళలు మానసిక స్థైర్యం కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం బాలికల గౌరవ పరిరక్షణ, వారిపై జరిగే సాంఘిక దురాచారాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గతంలో స్త్రీ, పురుషులు ఆహార అన్వేషణలో సరి సమానమైన పాత్రను పోషించేవారని, అనంతరం కాలగమనంలో స్త్రీలు ఇంటికే పరిమితం కావడంతో పురుషాధిక్యత ఎక్కువైందని తెలిపారు. సమాజంలో నైతిక విలువలు కలిగి మహిళలు, విద్యార్థినుల పట్ల గౌరవంగా నడుచుకోవాలన్నారు. విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిని గుర్తించి తల్లిదండ్రులు వెంటనే కళాశాల ప్రిన్సిపల్‌కు సమాచారం అందించాలన్నారు. అనంతరం అధ్యాపకులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అన్నపూర్ణ శారదను శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సీఎస్ లత, లావణ్య, భార్గవి, సిబ్బంది, జేకేజీ మెంటర్ లోకేశ్వర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థి తేజేష్‌కు ప్రశంస



తేజేష్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

నగరి: ఆంధ్రప్రదేశ్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు నిర్వహించిన అంతర్రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి పోటీలకు ఎంపికైన వశిష్ఠ విద్యాలయ 10వ తరగతి విద్యార్థి తేజేష్‌ను పాఠశాల కరస్పాండెంట్ రాజరాజేశ్వరి, హెచ్‌ఎం జయచంద్ర బుధవారం అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలంటూ ఆకాంక్షించారు. పీఈటీ సతీష్ మాట్లాడుతూ తేజేష్ బాల్‌బ్యాడ్మింటన్‌లో రెండవసారి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు గీత, విజయ పాల్గొన్నారు.

నేడు సామాజిక బహిరంగ సభ

వెదురుకుప్పం: మండల కేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు సామాజిక బహిరంగ సభ జరుగుతుందని ఏపీఓ ఇందు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 -2023 ఆర్థిక సంవత్సరంలో 25 గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 3 వరకు సామాజిక తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

- మళ్లీ ఏపీకి జగనన్న సీఎం కావాలి
- ప్రతిపక్షాలు అసత్యంపైనే ఆధారపడ్డాయి
- పార్టీ శ్రేణులు అసత్యాన్ని ఖండించే పదునైన ఖడ్గంలా ఉండాలి
- మంత్రి ఆర్కే. రోజా

నగరి: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ఏపీకి జగనన్న మళ్లీ సీఎం కావాలని మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం నగరిలోని క్యాంపు కార్యాలయంలో 'ఎందుకు ఏపీకి జగన్ కావాలి' నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో, అభివృద్ధి పనులతో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. అది అలాగే కొనసాగాలంటే ఏపీకీ మళ్లీ జగనన్న సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజలకు సాయం అందించాల్సిన అవసరం ఇంకా ఉందన్నారు. ఏ పాలనలో మంచి జరిగిందో ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిపక్షాలు, పచ్చమీడియా పని కట్టుకుని అసత్యాన్ని ప్రచారం చేస్తోందన్నారు. తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే పరిస్థితి వారికి లేదన్నారు. అందుకే అసత్య ప్రచారాలను నమ్ముకున్నారన్నారు. వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం, బాధ్యత మనపై ఉందన్నారు. నిజం నిద్రలేచేలోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తుందని, అలా అసత్యాలను నమ్మి ప్రజలు మోసపోకుండా చూడాలన్నారు. నిజం, నిజాయితీ మనవైపు ఉంది గనుక, పార్టీ శ్రేణులు అసత్యాన్ని ఖండించే పదునైన ఖడ్గంలా ఉండాలన్నారు. ప్రతి సర్వేలో కూడా వచ్చేది జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అని స్పష్టం అవుతోందన్నారు. రెట్టింపు ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. జగనన్న కుటుంబ సభ్యులుగా ఇది మనందరి బాధ్యతన్నారు. ఈ అంశాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చెప్పి చైతన్య వంతుల్ని చేయడమే 'ఎందుకు ఏపీకి జగన్ కావాలి' కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏకాంబరకుప్పం విద్యార్థులు



క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్జీఎఫ్ నెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో సాయికుమార్, బాలికల విభాగంలో గోమది, శాలిని, అండర్-14 బాలుర విభాగంలో భూపతి, బాలికల విభాగంలో వాణిశ్రీ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని హెచ్‌ఎం నమశ్శివాయం అభినందించారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. అలాగే నగరి నియోజకవర్గస్థాయిలో జరిగిన త్రోబాల్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచి, త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు హాజరయ్యే సుమారు 15 మంది విద్యార్థులను కూడా ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీడీలు మణి, కార్తికేయన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రతే లక్ష్యం





వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, గంగాధరనెల్లూరులో..



పాలసముద్రం మండలంలో కంటి అద్దాల పంపిణీ

కార్వేటినగరం: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండల పరిధిలోని అళత్తూరు సచివాలయ ఆవరణలో సర్పంచ్ గీతాంజలి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష శిబిరం సందర్శన

అలత్తూరులో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిర్వహణ చాలా గొప్పవిషయం అన్నారు. సురక్ష శిబిరాల ద్వారా ప్రతి గ్రామాన్ని పూర్తిగా మ్యాప్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ఏ ఇంట్లో అయినా అనారోగ్య సమస్యలు ఉన్నా, అక్కడే 7 రకాల పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. వైద్యసేవల విషయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీమోహన్, వైద్యాధికారి డాక్టర్ యూసఫ్, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ పాండియన్, డాక్టర్ దివ్యతేజ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీపతి, సర్వేశ్వర్ వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ మహేష్ తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, తహసీల్దార్ బాబు, డాక్టర్ మోహన్‌కృష్ణ సమక్షంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 321 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే 10 మందికి కట్టి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యసేవలు

పుత్తూరు రూరల్: ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చినట్లు వడమాలపేట పీహెచ్‌సీ డాక్టర్ చక్రపాణి తెలిపారు. బుధవారం ఏఎంపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలందించడానికి విలేజ్ క్లినిక్‌లను, రోగుల వద్దకే వైద్యం అందేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట మరో బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. శిబిరంలో 167 మంది వివిధ వైద్య సేవలందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, సర్పంచ్ లలితకుమారి, సచివాలయ కన్వీనర్ ఎం.సురేష్‌రాజు, డి.సుబ్రమణ్యంరాజు, డి.ఉమాపతి, డాక్టర్లు సత్యప్రియ, కీర్తనామయి, పావని, మధుబాబు, రవిశంకర్ రిషి పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండల పరిధిలోని చిన్నమరెడ్డి కండ్రిగ గ్రామ సచివాలయ ఆవరణలో ఎంపీడీఓ నీలకంఠారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జీడీ నెల్లూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి పరీక్షలు చేసుకున్న వారికి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సులోచన, వైద్యాధికారి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట సచివాలయ పరిధిలో ఎంపీడీఓ సుధాకరరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 353 మందికి రోగులను పరీక్షించి మందులు, 29 మందికి ఉచితంగా కళ్ల అద్దాలను పంపిణీ చేశారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని అంబోదరపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్ ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ అనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోగులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్ ఆకట్టుకుంది.









వెదురుకుప్పం: కొమరగుంటలో కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న అధికారులు, మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది, షుగర్ చెక్ చేసుకుంటున్న నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహారం స్టాల్